తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## కనుపూరు శ్రీముత్యాలమ్మ జాతర ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



చిల్లకూరు, మార్చి 16, ప్రభాతవార్త చిల్లకూరు మండలం తూర్పు కనుపూరు గ్రామంలో ఈనెల 25వ తేదీ నుండి జరగనున్న ముత్యాలమ్మ జాతరకు భక్తులందరూ వచ్చి అమ్మవారి ఆశీర్వాదాలు పొందాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కనుపూర్ ముత్యాలమ్మ అమ్మవారి జాతర ఆహ్వాన పత్రికలను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆవిష్కరణ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శక్తి స్వరూపిణి మహిమాన్విత గల ముత్యాలమ్మ అమ్మవారి జాతర 25వ తేదీ నుండి ఘనంగా జరుగుతాయని భక్తులకు కావాల్సిన ఏర్పాట్లన్నీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈవో నవీన్ కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు చిల్లకూరు దసరామిరెడ్డి సారంగం రమేష్ మారని సుబ్రహ్మణ్యం, నాయకులు పాపా రెడ్డి పురుషోత్తం రెడ్డి దువ్వూరు వినయ్ కుమార్ రెడ్డి, అన్నం మునిశేఖర్ పాల్గొన్నారు.

## మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ ప్రేక్షకపాత్ర!!

**పవిత్రతకు తూట్లు..**
**ఫ్లెక్సీలు, బ్యానర్ల రహిత తిరుపతి ప్రకటనలకే పరిమితం**
**-భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా విచ్చలవిడి పోస్టర్లు**



**ప్రభాతవార్త-తిరుపతి:**
యాత్రాస్థలం...స్మార్ట్‌సిటీ తిరుపతి నగరంలో విచ్చలవిడిగా పలు రకాల పోస్టర్లు.బ్యానర్లు ,ఫ్లెక్సీలు నగరజనం జడుసుకునేలా మారాయి. ఏరోజుకారోజు అందవిహీనంగా తయారైన వీటిని తొలగించడంలో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ కొరవడటం, నిర్లక్ష్యం వెరసి నగరంలో మనోభావాలు దెబ్బతీసేలా తయారయ్యాయి. నగరంలో చాలా వరకు అనుమతులు లేని పోస్టర్లు, బ్యానర్లు కనిపిస్తున్నా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మాకెందుకు వచ్చిన గొడవలే అన్నట్లు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారనే విమర్శలు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోనే వినిపిస్తున్నాయి. తిరుపతి నగరం అంతర్జాతీయంగా కూడా ఖ్యాతిచెందింది. ఇక్కడకు 60వేలమంది వరకు యాత్రికులు, భక్తులు వస్తుండగా మరో 20వేలమంది వరకు పలు రకాల వ్యాపారాలపై, విద్య, ఉద్యోగ విషయాలపై తిరుపతికి వస్తున్నారు. ఇలా వస్తున్న వారికి తొలుత నగరంలో రకరకాల పోస్టర్లు కనిపిస్తుండటంతో జడుసుకునే పరిస్థితి ఉంది. నగరంలో ప్రధానంగా ఆర్టీసి బస్టాండు, రైల్వేస్టేషన్, శ్రీనివాసం, తిలక్‌రోడ్డు, తుడ కార్యాలయం మార్గం, మరీ ఏకంగా ఆలయాలు పరిసరాల్లో కూడా పోస్టర్లు వెలుస్తున్నా సంబంధిత విభాగం అధికారులు తొలగించడంలో మాత్రం నిర్లక్ష్యంగానే ఉంటున్నారనేది ప్రధాన ఆరోపణ. తిరుపతి ప్రాధాన్యత దృష్ట్యా పోస్టర్‌రహిత నగరంగా తీర్చిదిద్దుతామని పదేపదే నగరపాలక సంస్థ కమిషనర్, మున్సిపల్ కౌన్సిల్ ప్రకటన చేస్తున్నా క్రిందిస్థాయిలో అమలులో విఫలమయ్యారనే చెప్పుకోవచ్చు. తిరుపతినగరంలోకి ప్రవేశించే రేణిగుంటరోడ్డులో, లీలామహల్ కూడలి, అలిపిరి గరుడసర్కిల్, నంది సర్కిల్, రామకృష్ణడీలక్స్, టౌన్‌క్లబ్, గాంధీరోడ్డు, తిలక్‌రోడ్డు, భవానీనగర్ కూడలి,టిటిడి పరిపాలన భవనం ఎదురుగా ,తుడ కార్యాలయం రోడ్డు, గ్రూప్‌థియేటర్స్ ప్రాంతం, వంటి చోట్ల మరీ రకరకాల పోస్టర్లు, ఫ్లెక్సీలు నగరజనానికి వికారం కలిగించేలా మారాయి. మరీ విద్యుత్ స్తంభాలకు, ప్రధాన కూడళ్ళలో విగ్రహాల వద్ద చుట్టూ ఇలా పోస్టర్లు, ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. తిరుపతి నగరం ప్రాధాన్యత దృష్ట్యా పోస్లర్లు, ఫ్లెక్సీలు లేని నగరంగా తీర్చిదిద్దుతామని కమిషనర్ ప్రకటన మాత్రం అమలులో నీరుగారిపోయిందని నగరజనం విమర్శిస్తున్నారు. మరీ రాజకీయనాయకుల పోస్టర్లు, ఉద్యోగసంఘాల పోస్టర్లు, ఆకస్మిక మరణాలు పోస్టర్లు, శుభస్వీకరణ పోస్టర్లు నెలల తరబడి కూడా టౌన్‌ప్లానింగ్ విభాగం తొలగించడంలో పూర్తిగా విఫలమైంది. వీటన్నిటితో తిరుపతి నగరం అందవిహీనంగా మారుతోంది. నగరాన్ని పోస్టర్‌ఫ్రీసిటీగా మార్చుతామని ప్రకటనలు ఆకాశాన్నంటుతున్నా అమలులో మాత్రం ఘోరంగా విఫలమయ్యారు. ఏదేని రాజకీయపార్టీల సమావేశాలు ఉన్నపుడు మాత్రం 48గంటలు అనుమతించే అధికారులు యాత్రికుల మనోభిప్రాయాలు దెబ్బతీసేలా వెలుస్తున్న పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించడంలో మున్సిపల్ కార్పొరేషన్ అశ్రద్ధ కనిపిస్తోంది. ఇకనైనా పుణ్యక్షేత్రం, యాత్రాస్థలం తిరుపతికి వస్తున్న భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పోస్టర్ రహిత నగరంగా తయారుచేయడంలో టౌన్‌ప్లానింగ్ చర్యలు తీసుకుంటుందని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంగా టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు కూడా మా దృష్టికి ఆయా ప్రాంతాల్లో పోస్టర్లు, బ్యానర్లు ఉన్నాయనే సమాచారం తీసుకువస్తే తొలగిస్తామని చెప్పడం కొసమెరుపు.

## శ్రీనివాసుని నైవేద్యం కొందరికేనా?

**రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీ**
**మూనాళ్ళ ముచ్చటగా మారిన ఉచిత చిన్నలడ్డు పంపిణి**
**ఉచిత ప్రసాదం మీద దృష్టి సారించలేకపోతున్న టిటిడి అధికారులు**

**శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో అభయహస్తమిస్తూ భక్తుల్ని ఆదుకుంటున్నారు. తొండమాన్ చక్రవర్తి నిర్మించిన ఈ ఆలయం నేడు టిటిడి పర్యవేక్షణలో నిర్వహించబడుతుంది, తిరుమలేశుని దర్శనానికి నిరీక్షించలేని భక్తులు దగ్గరలో ఉండే తొండమాన్‌పురంలో వెలసిన అభయ వెంకటేశ్వరుని దర్శనానికి వస్తున్నారు. శ్రీకాళహస్తిలోని ప్రసన్నవరదరాజస్వామి ఆలయం జీర్ణోద్ధారణ నాలుగుసంవత్సరాలుగా సాగుతూనే ఉంది . దాంతో తొండమనాపురానికి భక్తుల రద్దీ పెరిగింది. కాని ఆలయంలో భక్తులకు ఉచిత ప్రసాదం కొందరికే పరిమితమౌతుంది.**



శ్రీకాళహస్తిరూరల్, మార్చి 15 ప్రభాతవార్త
శ్రీకాళహస్తికి సమీపంలోని తొండమాన్‌పురంలో శ్రీదేవి, భూదేవి సమేత అభయ వెంకటేశ్వరస్వామి వెలసి భక్తుల కొంగుబంగారంగా వరాలిస్తున్నారు. రోజు రోజు భక్తుల సంఖ్య పెరుగుతుంది. ముఖ్యంగా శనివారాలు,ప్రముఖ దినాల్లో,పండగలలో మరీ రద్దీ అధికంగా ఉంటుంది.అయితే ఇక్కడకు భక్తులుఫుల్‌గా వస్తుంటే శ్రీనివాసుని నైవేద్యం కొందరికే అన్నట్లు మారింది. టిటిడి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఆలయాన్ని అభివృద్ధికి ధర్మకర్తల మండలి అధికారులు స్పందించాల్సి ఉంది. గతంలో పరిమితంగా ఇక్కడకు భక్తులువచ్చే వారు. టిటిడి ఇక్కడ కార్యాలయం, అలాగే వివాహాలకుకళ్యాణమండపం ఏర్పాటు చేసారు. వచ్చిన భక్తులు రాత్రి బస చేయటానికి సకల సదుపాయాలు కల్పించారు. అయితే అన్ని చేస్తున్న టిటిడి ఎందుకో భక్తులకు అందించే ఉచిత ప్రసాదం మీద దృష్టి సారించలేకపోతున్నారు.ప్రతి శనివారం స్వామి వారి చిన్నలడ్డు ఉచితంగా అందిస్తామని ప్రకటించారు. మూనాళ్ళ ముచ్చటగా మారింది. ఒకటి రెండు వారాలు అందించి చేతులు దులుపుకున్నారు. ప్రస్తుతం స్వామివారికి పెట్టిన నైవేద్య ప్రసాదం స్వామి వారికే పరిమితమౌతుంది.సాధారణంగా తిరుమలేశుని సన్నిధిలో స్వామి వారికి ప్రసాదంగా పులిహోర, పొంగలి,రెండు రకాలు,దద్ధోజనం, పెరుగన్నం, చిన్న లడ్డు అందిస్తుంటారు. కానీ తొండమాన్ పురంలో అలా జరగటం లేదు. కనీసం శనివారం స్వామి వారికి అందించే నైవేద్య ప్రసాదం అయినా అందరు భక్తులకు వస్తుందా? అంటే అదికూడా లేదు. కొ ందరికే పరిమితమౌతుంది.

**దిట్టం పెంచాలి:**
శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలో వెలసిన శ్రీదేవి,భూదేవి,సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో రోజు రోజుకు భక్తులు పెరుగుతున్నారు. శ్రీకాళహస్తిలోని ప్రసన్నవరదరాజస్వామి ఆలయం నిర్మాణం గత నాలుగు సంవత్సరాల నుంచి నిర్మాణం జరుగుతూనే ఉంది. అయితే దానికి తగ్గట్లు భక్తులకుసదుపాయాలు కల్పించాల్సి ఉంది. ముఖ్యంగా ఉచిత ప్రసాదాలను అందించాలని భక్తులుకోరుతున్నారు. భక్తులకు పెరుగుతున్న తరుణంలో ప్రసాదాలకు సంబంధించిన 'దిట్టం' పెంచాలని కోరుతున్నారు. కనీసం శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత ప్రసాదాలను భక్తులకు అందేటట్టు చూడాలని భక్తులు కోరుతున్నారు.

## నేటి నుంచి పది పరీక్షలు ప్రారంభం

**- పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు**
**- ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి**



చిత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త:
జిల్లాలో టెన్త్ పరీక్షలు సోమవారం నుండి ప్రారంభం కానుండటంతో పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేపట్టి సర్వం సిద్ధం చేసినట్లు జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి పేర్కొన్నారు. టెన్త్ పరీక్షలు సోమవారం నుండి ప్రారంభమై ఏప్రిల్ 1వ తేదీ వరకు జరుగుతాయన్నారు. టెన్త్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ పరీక్షల కోసం 118 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో 'ఏ' కేటగిరిలో 38 పరీక్షా కేంద్రాలు, 'బి' కేటగిరిలో 37 పరీక్షా కేంద్రాలు, 'సి' కేటగిరిలో 43 పరీక్షా కేంద్రాలు వున్నాయన్నారు. టెన్త్ పరీక్షలకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు మొత్తం కలిసి 21,248 మంది హాజరు అవుతున్నారన్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 20,954 మంది వున్నారని ఇందులో 10,802 బాలికలు, 10,152 బాలురు వున్నారన్నారు.

**-తిరుపతి జిల్లా వ్యాప్తంగా మొత్తం 164 పరీక్షా కేంద్రాలు**
**- జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్ వెల్లడి**



తిరుపతి కలెక్టరేట్, మార్చి 16 ప్రభాతవార్త :
తిరుపతి జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఏప్రిల్ 1వ తేది వరకు పది పరక్షలు జరగనున్నాయని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎస్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 164 కేంద్రాల్లో 28,656 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. 164 కేంద్రాల్లో 164 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 164 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 10 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 30 సిట్టింగ్ స్క్వాడ్‌లతో ప్రతి రోజు 40 కేంద్రాల్లో పర్యవేక్షణ ఉంటుందన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునే విధంగా అన్ని శాఖల అధికారులతో మాట్లాడి సర్వం సిద్ధం చేసినట్లు ఆయన తెలియజేశారు. విద్యార్థినీ, విద్యార్థులకు పరీక్షా సమయానికి ఒక గంట ముందే 8.30 గంటలకే చేరుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పరీక్షలకు రాసే విద్యార్థినీ, విద్యార్థులకు ఆయన అభినందనలు తెలియజేశారు.

## వేద వర్శిటీలో నేటి నుండి దక్షిణాది రాష్ట్రాల వేద సమ్మేళనం

తిరుపతి విద్య మార్చి 16 ప్రభాతవార్త: భారత కేంద్ర ప్రభుత్వ పరిధిలో కల మహర్షి సాందీపని రాష్ట్రీయ వేద విద్యా ప్రతిష్టానం, శిక్షణా మంత్రాలయ సంస్థ ఉజ్జయిని వారు, శ్రీ వేంకటేశ్వర వేద వర్శిటీ తిరుపతి వారి సంయుక్త ఆధ్వర్యంలో రేపటి నుండి మూడు రోజులపాటు ప్రతిష్టాత్మకంగా దక్షిణ భారత వేద సమ్మేళనం వేద విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరగనున్నది.సోమవారం ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానున్నది అనంతరం వేద విశ్వవిద్యాలయ కులపతులు ఆచార్య రాణీ సదాశివమూర్తి అధ్యక్షతన జరగనున్న ప్రారంభ సమావేశానికి కంచి కామకోటి పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ శంకర విజ యేంద్ర సరస్వతి స్వామి అనుగ్రహ భాషణం అంతర్జాల మాధ్యమం ద్వారాజరుగుతుంది. తిరుపతి జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం కులపతులు ఆచార్య జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి, రాష్ట్రీయ వేద విద్యా ప్రతిష్టానం సెక్రటరీ ఆచార్య విరూపాక్ష జడ్డీపాల్,ఆం.ప్ర.బయోడైవర్శిటీ బోర్డ్ చైర్మన్ ఎన్.విజయకుమార్ పాల్గొననున్నారు.

## ఇంకెంత కాలం ఈ నిరీక్షణ



**రెవెన్యూ భవనానికి మోక్షం ఎన్నటికి..?**
**రూ.90 లక్షలతో పాక్షిక నిర్మాణం**
**మరో రూ.50 లక్షలు వెచ్చిస్తే సరి..!**

చంద్రగిరి-ప్రభాతవార్త:
2018లో పురుడుపోసుకున్న రెవెన్యూ కార్యాలయ భవన నిర్మాణం పూర్తి స్థాయి నిధులకు నోచుకోక ఇంకెంత కాలం నిరీక్షించాలని పాలకులను నిలదీస్తున్నది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్న 2014-2019 మధ్య కాలంలో రూ.90 లక్షలతో నాటి కాంట్రాక్టర్ బొబ్బు చెంగారెడ్డి 2018 ఫిబ్రవరిలో పనులు ప్రారంభించారు. ఏడాది కాలంలోనే భవన నిర్మాణం పాక్షికంగా పూర్తి అయినప్పటికీ గత వైసిపి ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించడంలో నిర్లక్ష్యం చేయడంతో కోర్టును ఆశ్రయించి బిల్లులు పొందిన కాంట్రాక్టర్ తిరిగి భవన నిర్మాణం జోలికి వెళ్ళలేదు. 5 ఏళ్ళపాటు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఆగిపోయిన భవన నిర్మాణానికి మారిన ప్రస్తుత పరిస్థితుల రీత్యా కనీసం మరో రూ.50 లక్షలు నిధులను విడుదల చేసినట్లయితే రెవెన్యూ కార్యాలయ భవనం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుంది. అయితే ఆ మేరకు భవన నిర్మాణానికి అవసరమైన నిధులను సేకరించడంలో లేదా మంజూరు చేయించడంలో ఇటు ఎంఎల్‌ఏ పులివర్తి నాని లేదా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రత్యేక దృష్టి సారించినట్లయితే రెవెన్యూ ఉద్యోగులతో పాటు మండల ప్రజలకు అనువైన నూతన భవనం అందుబాటులోకి వస్తుంది. ఆ మేరకు మండల ప్రజల, రెవెన్యూ ఉద్యోగుల ఆశలు నెరవేరగలవని ఆశిద్దాం..!

## రుణాల మంజూరులో ఆయనే సీతయ్య!?

**-బ్యాంకర్ల ప్రమేయం లేకనే ఒక్క అధికారే ఇష్టారాజ్యం**



పూతలపట్టు, మార్చి 16, ప్రభాతవార్త:
ఆర్థికంగా అభివృద్ధిచెందేందుకు ప్రభుత్వం బడుగు,బలహీనవర్గాలకోసం అమలుచేస్తున్న రుణాల మంజూరులో మండలంలోని ఆ అధికారే అంతా తానై వ్యవహరిస్తూ ఇష్టమున్నవారికి వంతపాడుతున్నాడనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఆ అధికారి బ్యాంకర్ల ప్రమేయం కూడా లేకుండా అర్హులు ఎవరో?అనమర్హులు ఎవరనేది చూడకుండా తనదైన శైలిలో యవ్వారం నడిపేస్తున్నాడనేది బలంగా ప్రత్యక్షంగానే పలువురు మండల వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదీ పూతలపట్టుమండలకేంద్రంలో ఓ అధికారి తీరుగా మారింది. మండలంలో బడుగు, బలహీన వర్గాలకు సంబంధించిన బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరుకు కొందరు లబ్ధిదారులను ఎంపికచేయాలి. ఈ ఎంపికలో పూతలపట్టు భారతీయ స్టేట్ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, పి. కొత్తకోట,పేటమిట్టలోని యూనియన్ బ్యాంకు, పోలవరం లో ఉన్న యూనియన్ బ్యాంకు మేనేజర్లకు కూడా కనీస సమాచారం ఇవ్వకుండా వెనుకబడిన షెడ్యూల్ కులాల కార్పొరేషన్ ఇంటర్వ్యూలకు ఏకంగా ఆయనే లబ్ధిదారులను పిలిపించి ఇంటర్వ్యూ చేశారనేది ప్రధాన ఆరోపణ. లబ్ధిదారులు బ్యాంకు మేనేజర్లను కలసి లోను గురించి సమాచారం అడిగితే మాకు ఎలాంటి ముందస్తు సమాచారం లేదు. ఎంపీడీవో దగ్గర నుండి మాకు ఎలాంటి లిస్టు రాలేదని బిపి లబ్ధిదారులకు చెప్పడంతో బిక్కమొకాలు వేశారు. మండలంలో ఉన్న బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నట లబ్ధిదారులు మండంలలోని ఆ అధికారికి, బ్యాంకు మేనేజర్‌లకు మధ్య సమన్వయం లేకపోవడం వల్ల లబ్ధిదారులు పూర్తిగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి పూతలపట్టు మండలంలో ఉన్న బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు న్యాయం చేయాలని, వెనుకబడిన షెడ్యూల్ కులాల జీవితాల్లో ఆశలు నింపాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

## అరణ్యంలో మూగజీవాల మరణ మృదంగం..!

**వేటగాళ్ళ ఉచ్చుకు యువకుడు దుర్మరణం..గుట్టు చప్పుడు కాకుండా రాజీలు..! దళారుల రంగప్రవేశం..ప్రాణం ఖరీదు రూ.6 లక్షలు..!**

గంగవరం,మార్చి 16, ప్రభాతవార్త :
వన్య మృగాల సంరక్షణపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయాలు ఖర్చు చేస్తున్నప్పటికీ కొందరు అటవీశాఖ అవినీతి అధికారుల చేతివాటాలతో ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తున్నారు. మండల పరిధిలోని అటవీ ప్రాంతాలలో, అటవీ సమీప గ్రామాలలో వేటగాళ్ళు అమర్చిన విద్యుత్ ఉచ్చులో పడి ముగజీవాలు,వన్య మృగాలు,రైతుల మరణ మృదంగం మోగుతుంది.అందమైన అడవుల్లో జంతుజాలమే కనువిందు..అలాంటి అభయారణ్యంలోనికి జల్సాలకు, అక్ర మార్జనకు అలవాటుపడిన కొందరు వేటగాళ్ళు చొరబడి, వన్యమృగాల మాంసాన్నే ప్రధాన వ్యాపార వృత్తిగా పెట్టు కొని పచ్చని ప్రకృతిలో స్వేచ్ఛగా తిరిగే మూగ జీవాల ప్రాణా లను హతమార్చుతున్నారు.వేటగాళ్ళు ఉచ్చులు పెట్టి మరీ వన్య ప్రాణుల ఊపిరితీస్తున్నారు. వివరాల్లోకి.. మండలంలోని కల్లుపల్లె,మేలుమాయి గ్రామాల రెవెన్యూ పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతం ఉంది.ఈ అటవీ ప్రాంతాల్లో ఏనుగులు,నెమళ్ళు, జింకలు,దుప్పిలు, కుందేళ్ళు, అడవి పందులు కొండగొర్రెలు,ఉడుములు తదితర వన్య మృగాలు అధిక సంఖ్యలో జీవిస్తున్నాయి. ఈనేపథ్యంలో అక్రమార్కులు కొందరు అటవీశాఖ అవినీతి అధికారులతో కుమ్మకై అరణ్యంలోని వన్యప్రాణుల జీవితగాద అక్రమార్కుల ఉచ్చులోపడి మాంసపు ముద్దలుగా మారుతు న్నాయి.వన్యప్రాణుల మాంసాన్ని వ్యాపారంగా మలుచుకోని స్మగ్లింగ్ వ్యాపారంగా కొనసాగిస్తున్నారు.అడవులు గ్రామాలు దాటి పట్టణాలలో అటవీ వేట మాంసం విక్రయాలు జోరుగా సాగుతున్నప్పటికీ అధికారులు తమకు సంబంధంలేనట్లు వ్యవహరిస్తుండడంపై అటవీశాఖ,విద్యుత్‌శాఖ అధికారుల పనితీరుపై ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు.మండలంలోని కొత్తపల్లె గ్రామానికి చెందిన మహదేవరెడ్డి శాంతమ్మ దంపతుల కుమారుడు కార్తీక్‌రెడ్డి(22),ఇతని మిత్రుడు యుగందర్(22)తో కలసి ఈ నెల 13న అర్ధరాత్రి తన పాడిఆవు ఆచూకి కోసం గాలిస్తుండగా మేలుమాయి సమీపంలోని ఓ రైతు పొలం వద్దకు వెళ్లగానే వేటగాళ్ళు వన్యమృగాల కోసం పొలంలో ఓ కొయ్యకు బీరుబాటిళ్ళు,విద్యుత్ తీగలు అమర్చిన ఉచ్చులో పడి కార్తీక్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా యుగందర్ తీవ్రంగా గాయపడ్డాడు .విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు,గ్రామస్తులు పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి తీవ్రంగా గాయపడ్డ యుగంధర్‌ను పలమనేరు ప్రభుత్వం ఆసుపత్రికి తరలించి కార్తీక్ మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభంలోనే కొందరు దళారులు రంగప్రవేశం చేసి అధికారులను రాజకీయ ప్రలోభాలకు గురిచేసి అధికారుల విధులకు ఆటంకం కల్పిస్తూ..చివరకు అక్రమార్కులు అమర్చిన ఉచ్చులో పడి ప్రాణం కోల్పోయిన యువకుడి నిండుప్రాణం ఖరీదు రూ.6లక్షలుగా ధర నిర్మాయించి ఆ రూ.6లక్షలను తీర్మానం చేసి మృతుని కుటుంబ సభ్యులకు విడతల వారిగా చెల్లించేలా ఒప్పందం చేసుకుని కేసు లేకుండా అక్రమార్కులకు ఎటువంటి శిక్ష లేకుండా చేసిన ఘనత మాదేనని ఆ దళారులు ప్రగల్బాలు పలకడం ప్రజలల్లో విస్మయానికి గురి చేస్తుంది.

ఈ విషయమై "ప్రభాతవార్త" ప్రతినిధి పలమనేరు అటవీశాఖ అధికారి నారాయణను వివరణ కోరగా..పొలాల్లో వేటగాళ్ళు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ఉచ్చులో పడి ఎవరైన మృతి చెందితే తమ శాఖకు సంబంధం లేదని విద్యుత్,పోలీసు శాఖల అధికారుల బాధ్యత అని ఆయన తెలపడం గమనార్హం.ఏది ఏమైనప్పటికి వన్యప్రాణుల సంరక్షణ,రైతుల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉన్నప్పటికీ అక్రమార్కులలో మార్పు రావడం లేదు.అటవీశాఖ అధికారులు పర్యవేక్షణ లోపంతోనే ముగజీవాల మరణ వేదన,రైతుల ప్రాణాలు బలికావడమే ఇందుకు నిదర్శనమని ప్రజలు,పర్యవరణ వన్యప్రాణుల ప్రేమికులు వాపోతున్నారు.ఇప్పటికైన రాష్ట్ర,జిల్లా స్థాయి అధికారులు స్పందించి అక్రమార్కులపై,అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవల్సిన అవసరం ఎంతైన ఉంది.



వేటగాళ్ళ ఉచ్చులో పడి మృతి చెందిన యువకుడు కార్తీక్‌రెడ్డి



గతంలో వేటగాళ్ళ ఉచ్చులో పడి మృతి చెందిన గజరాజు, దుప్పి , వేట కుక్కలు

## టువీలర్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి తీవ్రగాయాలు

కుప్పంరూరల్, మార్చి 16 ప్రభాతవార్త



మండలంలోని వానగుట్టపల్లి క్రాస్ వద్ద ఆదివారం ఓ కారు టువీలర్‌ను ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రగాయాలపాలయ్యారు. ఈసంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా..దొమ్మర అగ్రహారంకు చెందిన మురళి (29), సింగారవేలు (28)లు తమ గ్రామానికి వెళ్లేందుకు మల్లానూరు వైపు నుంచి టువీలర్‌లో వస్తుండగా ఎదురుగా వచ్చిన కారు టు వీలర్‌ను ఢీకొంది. దీంతో వారిద్దరికీ తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించారు. గాయపడ్డ వారిలో ఒకరి పరిస్థితి కొంత విషమంగానే ఉన్నట్లు తెలిసింది. కాగా కారు వి.కోటకు చెందిన వారిదని సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమంగా చింతచెట్లు నరికివేత

శ్రీరంగరాజపురం, మార్చి 16 ప్రభాతవార్త:

సికెపురం పెద్దచెరువు కట్టపై వున్న చింత చెట్లను అక్రమంగా నరికి తమిళనాడు రాష్ట్రానికి కొంతమంది వ్యక్తులు తరలించారు. ఈ మేరకు విఆర్‌ఓ చింతచెట్లను నరికి అక్రమంగా తమిళనాడుకు తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చెట్లను పోషించడం నరికివేతను అడ్డుకోవడం పర్యావరణంను పరిరక్షించి పచ్చదనం పెంచడం కోసం ప్రభుత్వం పక్కాగా వాల్టా చట్టంను అమలు చేస్తోంది. అయితే ఈ చట్టం శ్రీరంగరాజుపురం మండలంలో ఆపహాస్యం పాలువుతుంది. మండల పరిధి నుండి సరిహద్దులో వున్న తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా నరికిన చెట్లను రవాణా చేస్తున్నప్పటికీ అటు రెవెన్యూ, అటు పోలీసు అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా చింత చెట్లను నరికివేయడంపై బిజెపి నేతలు స్పందించి తహసిల్దారుకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు పోలీసులు విచారించి అక్రమ చెట్ల రవాణా దారులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

## తమిళనాడుకు అక్రమ ఇసుక రవాణా

**గుడిపాల, మార్చి 16 ప్రభాతవార్త:** తమిళనాడు రాష్ట్రానికి అక్రమంగా మూడు లారీల్లో ఇసుకను తరలిస్తుండటంతో గుడిపాల ఎస్ఐ రామ్మోహన్‌రావు ఆదివారం ఆ లారీలను సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాపై ఎస్ఐ రామ్మోహన్‌కు సమాచారం అందడంతో ఆదివారం ఎస్ఐ సిబ్బందితో కలిసి గొల్లమడుగు పరిసర ప్రాంతాల్లో మకాం వేశారు. ఈ క్రమంలో ఈ దారిలో ఇసుక లోడ్‌తో అక్రమంగా తమిళనాడు రాష్ట్రంకు తరలించడానికి మూడు లారీలు ఇసుక లోడ్‌తో అటువైపు రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి నిలుపుదల చేశారు. లారీల్లో ఇసుక వుండటంతో ఎస్ఐ రామ్మోహన్ మూడు లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**చిత్తూరు, మార్చి 16 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరు తప్పక హాజరు కావాలని ఆవమె తెలిపారు. అలాగే నియోజకవర్గ, మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధిత అధికారులు అందరు హాజరై ప్రజల నుండి సమస్యలు తెలుసుకుని వాటిని పరిశీలించి సత్వరం పరిష్కరించాలని ఇన్‌ఛార్జీ కలెక్టర్ జి.విద్యాధరి ఓ ప్రకటనలో తెలిపారు.

## నేడు పోలీస్ గ్రీవెన్స్

చిత్తూరు, మార్చి16 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి జిల్లా పాత పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుండి ఎస్పీ మణికంఠ చందోలు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి ఎస్పీ మణికంఠ చందోలు హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి వాటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోనున్నారు. ఈ కార్యక్రమాలు ప్రజలు హాజరై తమ సమస్యలను ఎస్పీ మణికంఠ చందోలు దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవచ్చును.

## జర్మనీ నుంచి వచ్చిన మాజీ డిప్యూటీ సీఎంను కలిసిన వైసీపీ నాయకులు

*వెదురుకుప్పం, మార్చి 16 ప్రభాతవార్త :*



జర్మనీ దేశం వెళ్ళి తిరిగి వచ్చిన మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని వెదురుకుప్పం మండల నాయ కులు కలిసి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. విదేశ పర్యటన ముగించుకుని వచ్చిన తమ నేతను ఆదివారం పుత్తూరులో గల ఆయన నివాసం వద్ద మర్యాదపూర్వకంగ కలిసి దుశాలువతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, జడ్పీటిసి సభ్యులు చలం పాళ్యం సుకుమార్, మండల ఉపాధ్యక్షులు మరకాలకుప్పం రామయ్య, నాయకులు బట్టే సుబ్రమణ్యం, పెద్ది రెడ్డి, శివాజీ, తోకల మురళి రెడ్డి, రామచంద్రా రెడ్డి, బొజ్జా రెడ్డి, వెంకటేష్, రోసు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

కుప్పం, మార్చి 16 ప్రభాతవార్త



కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో సామగుట్టపల్లి క్రాస్ సమీపంలో ఆదివారం ఉదయం ఎదురెదురుగా వచ్చిన ఓ టువీలర్, ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలిలా.. శాంతిపురం మండలం సొన్నేగానిపల్లికి చెందిన జయప్ప ఆదివారం ఉదయం తన ద్విచక్రవాహనంలో కుప్పం వైపు నుంచి తన స్వగ్రామానికి బయలుదేరి వెళ్తుండగా మార్గమధ్యంలో సామగుట్టపల్లి క్రాస్ సమీపంలో పలమనేరు వైపు నుంచి కుప్పం వస్తున్న ఆర్టీసీ బస్సు రెండూ ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయన్నారు. ఈ ప్రమాదంలో జయప్ప అక్కడికక్కడే తలకు తీవ్రగాయాలై మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గణనాధుని పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమీషనర్

కాణిపాకం, మార్చి 16 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమీషనర్ కృష్ణతేజ ఆదివారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజే శారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహిం చారు.వారి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, దేవస్థానం మాజీ ఛైర్మన్ మణినాయుడు, సూపరెండెంట్ వాసు, డీపీఓ సుధాకర్‌రావు, ఐరాల తహశీల్దార్ మహేష్ కుమార్,ఎంపీడీఓధనలక్ష్మీ,ఈఓపీఆర్డీకుసుమకుమారి,టెంపుల్‌ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లును మూసివేయాలి

తవణంపల్లె, మార్చి 17 ప్రభాతవార్త:

పదవ తరగతి పరీక్షా కేంద్రాలకు సమీపంలోని జిరాక్స్ సెంటర్లును ఈనెల 17 నుండి ఏప్రిల్ 1 వరకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు మూసి వేయాలని స్థానిక ఎస్సై చిరంజీవి తెలిపారు. ఈనెల 17 నుండి ఏప్రిల్ 1 వరకు పదవ తరగతి పరీఓలు జరుగుతున్నందున మండల మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు పరీఖా కేంద్రాలకు 200 మీటర్లు లోపున జిరాక్స్ సెంటర్లును మూసి వేయాలని తెలిపారు. అలాగే పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ముగ్గురు అలంతకంటే ఎక్కువ మంది గుమికూడి వుండకూడదన్నారు. నిబంధనల అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.ఇదిలా వుండగా సోమవారం నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు సంభందించి మండలంలోని అరగొండ, తవణంపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలల పరీక్షా కేంద్రాల వద్ద అన్ని ఏర్పాటు చేపట్టి పూర్తి చేయడం జరిగిందని ఎంఈఓ హేమలత తెలిపారు.

## ఎపిఆర్ఎస్ఎ కుప్పం డివిజన్ అధ్యక్షుడిగా బాలాజీరావు

కుప్పం, మార్చి 16 ప్రభాతవార్త



ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ఎపిఆర్ ఎస్ఎ) కుప్పం డివిజన్ అధ్యక్షుడిగా రామకుప్పం ఉప తహశీల్దార్ బాలాజీ రావు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో ఎన్నికల అధికారులు సుధాకర్, హుసేన్‌ల నేతృత్వంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా గుడుపల్లె తహశీల్దార్ సీతారాం, ఉపాధ్యక్షులుగా సీనియర్ అసిస్టెంట్ నారాయణ, ఎంఆర్ఐ జోషిలు ఎన్నికయ్యారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, జాయింట్ కార్యదర్శులుగా సీనియర్ అసిస్టెంట్ దామోదరాచారి,జూనియర్ అసిస్టెంట్ చరిత్ నాయుడు, కోశాధికారిగా వెంకటాచలపతి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా జూనియర్ అసిస్టెంట్లు గంగాధరం, శరత్‌బాబులు ఎన్నికయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షులు బాలాజీ రావు మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బలరాంమూర్తి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కుప్పం,మార్చి 16 ప్రభాతవార్త



ప్రజా సమస్యల పరిష్కారం కోస ం కుప్పం నియోజకవర్గస్థాయిలో సోమ వారం కుప్పం మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం (పిజిఆర్ఎస్) నిర్వహిస్తున్నట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ఈ జరుగుతుందన్నారు.నియోజకవర్గప్రజలుఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## కొమరగుంటలో పశువుల పండుగ

వెదురుకుప్పం, మార్చి 16 ప్రభాతవార్త :



మండలంలోని కొమరగుంటలో ఆదివారం పశువుల పండుగ వైభవంగా నిర్వహించారు. ప్రసన్న వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు పురస్కారించుకుని పెద్ద సంఖ్యలో గిత్తలు తీసుకురావడంతో వేడుకగా యువకులు గిత్తలతో కుస్తీకి దిగారు. గ్రామస్థులు పశువుల పండుగలకు కావలసిన వసతులు, సౌకర్యాలు కల్పించారు. ఉదయం చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ఎద్దుల యాజమానులు పెద్ద సంఖ్యలో గిత్తలు తీసుకుని కొమరగుంటకు చేరుకోవడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. వందల సంఖ్యలో గిత్తలు,వేల సంఖ్యలో వీక్షకులు, బరిలోకి దిగే యువకులు చేరుకోవడంతో పశువుల ఆట మొదలైయింది. గ్రామస్థులు నడివీధిలో పూజలు చేసి అల్లి ఏర్పాటు చేసి గిత్తలు పోటీ ప్రారంభించారు. రైతులు గిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి చెక్క పట్టీలు కట్టి అందంగా ముస్తాబు చేశారు. ఇష్ట దైవం, రాజకీయ నాయకులు, సీని నటుల ఫోటోలతో కొమ్ములకు చెక్క పటీలు,టవలు, నగదు కట్టి యువత పై బరిలోకి దించారు. జన సంద్రంగా మారి పెద్ద సంఖ్యలో జనం చేరుకోవడంతో మిద్దెలు, వీధులు జన సంద్రంగా మారిపోయాయి. అలంకరించి గిత్తలను దప్పుల దరువులు మధ్య అల్లె వద్ద వదలడంతో యువకులు రెట్టించిన ఉత్సహంతో బరిలోకి దిగి చెక్క పట్టీల కోసం గిత్తలతో కుస్తీకి దిగడంతో ఈలలు, కేరితల నడుమ నువ్వ ... నేనా అంటూ పోటా పోటీగా పోరు జరిగింది. కొన్ని గిత్తలు దొరికిపోవడంతో యువకులు చెక్క పట్టీలను చేజికించుకుని విజయదరహాసంతో కేరితలు కొట్టారు. మరీ కొన్ని గిత్తలు జనంను చీల్చుకుంటూ యువకులను నిరాశ పర్చుతూ పరుగులు పెట్టాయి. చెదురు మదురు సంఘటలు మినహా అద్యంతం పోటీలు రసవత్తంగా జరిగాయి. గంగాధర నెల్లూరు నియోజకవర్గం యువత అధ్యక్షులు గురసాల కిషన్‌చంద్ పశువుల పండుగ వీకించడంకు వచ్చిన ప్రజలకు అన్నదానం చేసి వపతులు కలించారు. ఆయనతో పాటు కార్యక్రమంలో నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు బట్టే చాణిక్య ప్రతాప్, టీడీపీ నాయకులు మునిరాజ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మురళీ రెడ్డి, మునిక్రిష్ణ, మురళి

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేస్తున్న వాచ్మెన్ జ్ఞానశేఖర్

పూతలపట్టు, మార్చి 16, ప్రభాతవార్త



మండల పరిధిలో వసతి గృహ పదవ తరగతి పి కొత్తకోట ప్రభుత్వ బాలుర వసతి గృహము నుండి పదవ తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత తీసుకురావాలని భవిష్యత్తులో ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని నిరంతరం వారి కోసం వారిలో ఉన్న ప్రతిభను బయటకు తీసుకురావడానికి అహర్నిశలు కష్టపడుతున్న వాచ్మెన్ జ్ఞాన శేఖర్ ఆహ్లాదకరమైన వాతావరణం క్రమశిక్షణతో కూడిన విద్య విద్యార్థులను సంరక్షించడంలో పేరుకు వాచ్మెన్ అయిన విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వేయడంలో అతనకు సాటిలేరు ఇతను సాంఘిక సంక్షేమ శాఖ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులుగా ఉండడం అతను పని చేస్తున్న వసతి గృహంలో విలువలతో కూడిన సభ్యత సంస్కారం నేర్పించడం చాలా అభినందనీయమని వసతి గృహ విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## రామకృష్ణ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుంది

పుంగనూరు రూరల్, మార్చి 16, ప్రభాతవార్త



దారుణ హత్యకు గురైన తెలుగుదేశం పార్టీ కార్యకర్త రామకృష్ణ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని నియోజకవర్గ దేశం ఇంచార్జ్ చల్లా బాబు తెలిపారు. శనివారం పుంగనూరు మండలంలోని కృష్ణాపురంలో దారుణ హత్యకు గురైన పార్టీ కార్యకర్త రామకృష్ణ భౌతికకాయానికి ఆదివారం అంత్యక్రియలు జరిగాయి. పార్టీ ఇన్చార్జి చల్లా బాబు ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హోం మంత్రి వంగలపూడి అనిత తదితరులు బాధిత కుటుంబంకులతో ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. ఈ దారుణ ఘటనకు సంబంధించి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి సత్వరం న్యాయం జరిగేలా పోలీస్ శాఖను ఆదేశించామని తెలిపారు. ఆదివారం ఈ మేరకు పలమనేరు డిఎస్పి ప్రభాకర్ ఆధ్వర్యంలో నాలుగు దర్యాప్తు బృందాలు హత్య పరిశోధన ప్రారంభించాయి. రామకృష్ణ హత్య కేసులో ముందుగానే సమాచారం ఉన్నప్పటికీ ఎటువంటి చర్య తీసుకోని సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులను ఇప్పటికే ప్రభుత్వం సస్పెండ్ చేసింది. రామకృష్ణ హత్య జరిగిన నేపథ్యంలో ఎటువంటి ఉద్రిక్త వాతావరణం నెలకొనకుండా చంద్రమాకులపల్లి పంచాయతీ గ్రామాలలో పోలీసులు చర్యలు చేపట్టారు.

## మహామంగళే పుణ్యభూమే త్వదర్తే

పుంగనూరు రూరల్, మార్చి 16, ప్రభాతవార్త



నమస్తే! సదావత్సలే మాతృభూమి త్వయా హిందూ భూమే సుఖం వర్థితోహం అంటూ ఆర్ఎస్ఎస్ పుంగనూరు శాఖ ఆదివారం కవాతు నిర్వహించింది. ఏటా పుంగనూరులో సుగుటూరు గంగమ్మ జాతర ముందుగా ఆర్ఎస్ఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వేలాది మందితో కవాతు నిర్వహించడం పరిపాటి. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం పట్టణంలో శ్రీ సుగుటూరు గంగమ్మ ఆలయం ఆవరణలో పుంగనూరు ఖండ్ సమావేశం నిర్వహించారు. ప్రపంచంలో భారతదేశం వంటి ఘనమైన దేశం అత్యున్నత విలువలు కలిగిన దేశం మరొకటి లేదని, ఈ దేశంలో పుట్టినందుకు మాతృభూమి రుణం తీర్చుకోవడానికి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణ ప్రధాన రహదారుల వెంబడి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటువంటి సంఘటనలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి

చౌడేపల్లి, మార్చి 16 ప్రభాతవార్త



రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు... బోయ కొండ-మదనపల్లి ప్రధాన రహదారి పక్షిరాజపురం రెండవ ఘాట్‌రోడ్డు వద్ద అటుగా వెళుతున్న స్కూటర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మదనపల్లి ఎస్వీఆర్ లేఅవుట్‌కు చెందిన ఉపాధ్యా యుడు వెంకట్రమణ(55) తీవ్ర గాయాలపాలయ్యాడు. గాయపడ్డ అతన్ని 108సేవల ద్వారా మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కాగా ఉపాధ్యాయుడు వెంకట్రమణ చౌడేపల్లి తన సమీప బంధువు గృహప్రవేశానికి వచ్చి వెళుతున్న తరుణంలో ప్రమాదం జరిగింది.

## కొండనిండిన భక్తజనం

బోయకొండ(చౌడేపల్లి), మార్చి 16 ప్రభాతవార్త



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో నిండిపోయింది. యాత్రీకుల వసతుల సమకూర్చేందకు ప్రాధ్యానత ఇస్తామని ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం అన్నారు. కొండ దినాన్ని పురష్కరించుకొని ఉదయాన్నే అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ గావించారు. ఆలయంలో భక్తులకు చేస్తున్న సేవలను ఇఓ ఏకాంబరం పర్యవేక్షిం చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మూలస్థాన అమ్మ వారి ఆలయంలో మరిన్ని సేవలు కల్పించారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది యాత్రీకులకు వసతులను సమకూర్చారు.

## ముగిసిన కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

పుంగనూరు, మార్చి 16, ప్రభాతవార్త



వైభవంగా జరుగుతున్న శ్రీ కళ్యాణ వేంకటరమణ స్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. 11 రోజులపాటు ఈ బ్రహ్మోత్స వాలు జరిగాయి. ఆదివారం స్వామివారికి సుప్రభాతం, మహాశాంతి అభిషేకం పూజ కైంకర్యాలను చేపట్టారు. అనంతరం తిరుప్పావడ సేవను నిర్వహించారు.

## నేటి నుంచి పదోతరగతి పరీక్షలు

తొట్టంబేడు, మార్చి 16 ప్రభాతవార్త

నేటి నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్నాయి. ఈఏడాది పట్టణంలో మొత్తం 12 పరీక్షా కేంద్రాల్లో 2044మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షా కేంద్రాలుగా ఏపిటిడ బ్యుఆర్ఎస్ తెలుగగంగ కాలనీలో 180మంది, నారాయణ ఇంగ్లీష్‌మీడియం పాఠశాలలో 200మంది, భాస్కరపేట మున్సిపల్ హైస్కూల్‌లో 121మంది, బాబుఅగ్రహారం మున్సిపల్ పాఠశాలలో 123, ఆర్‌పిబిఎస్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏ కేంద్రంలో 130మంది, బి కేంద్రంలో 118మంది, బాలికల పాఠశాల ఏ సెంటర్‌లో(ఓఎస్ఎస్‌సి) 177, బికేంద్రంలో 170 మంది, ఎస్ఎస్‌బి మున్సిపల్‌జయరామారావువీది.(ఎన్టీఆర్‌నగర్)లో 170మంది, చైతన్య టాలెంట్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో 200మంది, ఎంజిఎం ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో 240మంది భాష్యం ఉన్నత పాఠశాలలో 215మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఈనెల 17వ తేదీన ల్యాంగేజ్(గ్రూప్-ఎ), ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్ కోర్సు) 19న బుధవారం హిందీ, 21న శుక్రవారం ఇంగ్లీషు, 22న ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ 1(కాంపోజిట్ కోర్సు), మరియు ఓఎస్ఎస్‌సి మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం), (అరబిక్), (పర్షియన్), 24న సోమవారం గణితం, 26న బుధవారం ఫిజికల్ సైన్సెస్, 28న బయోలజీ సైన్స్, 29న శనివారం ఓఎస్ఎస్‌సి ప్రధాన లాంగ్వేజీ పేపర్-2, 31.3.2025న మరియు 01.04.2025 సోమ, మంగళవారాల్లో సోషల్‌స్టడీస్ పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి 12.45గంటల వరకు జరుగుతాయని విద్యార్థులు ఉదయం 8.30గంటలకు పరీక్షల కేంద్రానికి చేరుకోవాలని ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్యలు తెలిపారు. కాగా తొట్టంబేడు మండలంలోని పూడి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 168మంది పరీక్షలు రాస్తున్నట్లు విద్యాశాఖాధి కారి సిహెచ్‌ఎం.భారతీ అన్నారు.

## పొట్టిశ్రీరాములుకు టిటిడి ఘననివాళి



ఆంధ్రప్రదేశ్ అవతరణకోసం ప్రాణార్పణం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములుకు టిటిడి ఉద్యోగులు పుష్పాంజలి ఘటించారు.ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రభాతవార్త-తిరుపతి

## వైద్య శిబిరానికి స్పందన

తిరుపతి హెల్త్, మార్చి 16 ప్రభాతవార్త ః



ఆరేటమ్మకాలనీ, పుత్తూరు కీ.శే మాదిరాజు చెంగలరాజు శుభ స్వీకరణ సందర్భంగా వారి తనయుడు హేమ సుందర్ వర్మ,సతీమణి సుజనశ్రీ ఆధ్వర్యంలో ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణకుమార్, వాలంటీర్లు, వాసన్ ఐకేర్ పీఆర్వో వెంకటేష్, రవిశేఖర్ వర్మ, రామ్మోహన్ వర్మ, లవకుమార్, కృష్ణం రాజు, జనార్ధన్‌రాజు, హరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు కాణిపాకంలో సంకటహర గణపతివ్రతం

**కాణిపాకం, మార్చి 16 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో సోమవారం సంకటహర గణపతివ్రతంను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ప్రతినెలా పౌర్ణమి అనంతరం వచ్చే చతుర్థి రోజున ఈవ్రతాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు సోమవారం ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు జరిగే ఈవ్రతంలో భక్తులు 350 రూపాయలు టిక్కెట్ చెల్లించి గోత్రనామాలతో ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఈఓ కోరారు.అలాగే రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు స్వామివారికి స్వర్ణరథోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు.

## పారిశుద్ధ్య కార్మికులకు పిఎఫ్ బకాయిలు చెల్లించాలి

కుప్పం, మార్చి 16 ప్రభాతవార్త



కుప్పం ఏరియా ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికుల పిఎఫ్ బకాయిలను సంబంధిత ఏజెన్సీ కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని ఎపిఎంసిఇడబ్ల్యు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసరి చంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో జరిగిన కార్మికులు, సెక్యూరిటీ గార్డుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కుప్పం ఆస్పత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది, చెద పురుగుల నివారణ కార్మికుల వద్ద ఏజెన్సీ ప్రతి నెలా కార్మికులకు వేతనంతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ నగదు చెల్లించక కార్మికుల పొట్టకొడుతున్నారన్నారు. ప్రభుత్వ జిఓ మేరకు వేతనాలు ఇవ్వక కార్మికుల శ్రమను దోచుకుంటున్నారన్నారు. ఆస్పత్రి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పనులు చేస్తున్న వారి పట్ల ఏజెన్సీ నిర్వాహకులు మోసం చేయడం తగదన్నారు. వెంటనే పిఎఫ్, ఇఎస్ఐ నగదును కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై సంబంధిత మెడికల్ అధికారి తగు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా జయభారతి, ఉపాధ్యక్షులుగా శకుంతల, కార్యదర్శిగా సంగీత, ఉప కార్యదర్శులుగా కుప్పమ్మ, తిమ్మరాయలు, కోశాధికారిగా వరలక్ష్మిని ఎన్నుకున్నారు. సమావేశంలో ఎపి మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ చంద్రశేఖర్, కార్మికులు పళని, రామదాసు పాల్గొన్నారు

# జాతీయ తెలుగు భాష మాధురీ పురస్కారాలు విజయవంతం



### – అందరిని ఆకట్టుకున్న జానపద పద్యగానం

తిరుపతి హెల్త్, మార్చి 16 ప్రభాతవార్త :

తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సి.యూ.ఓ డాక్టర్ వి. రత్నం, అంతర్జాతీయ ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ ధనాశి ఉషారాణి నిర్వహణలో ఆదివారం తిరుపతి యూత్ హాస్టల్‌లో తెలుగు భాష పరిరక్షణపై జరిగిన జానపద పద్యగానం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో వంద మంది కవులు,రచయితలు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి, వివిధ ప్రాంతాల నుంచి హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా షీ టీమ్ ఆఫీసర్ సుమతి, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డిగ్రీ కళాశాల హెచ్‌వోడీ కృష్ణవేణి, కథ రచయిత పేరూరు బాలసుబ్రమణ్యం. తెలుగు మాధురీ పురస్కారంతో డాక్టర్ ధనాశి ఉషారాణి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు శాలువా పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. జానపద కళాకారులు రెడ్డి ప్రసాద్, రెడ్డెప్ప, రాజశేఖర్, డాక్టర్ ధనాశి ఉషారాణి తెలుగు భాష విశిష్టతపై జానపదము వినిపించడంతో తెలుగు భాష మాధుర్యం సభలో నిండుగా ఉత్తేజంగా నిలిచింది.

అనంతరం సంస్థ సి.యూ.ఓ డాక్టర్ వి. రత్నంకి జాతీయ సహస్ర ప్రజ్ఞా నిధి పురస్కారమును షీటీమ్ ఆఫీసర్ సుమతి, డాక్టర్ ధనాశి ఉషారాణిని తెలుగు మాధురీ పురస్కారంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు, రచయితలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అమరజీవి ఆశయాలు తెలుగువారికి ఆదర్శం

తిరుపతి(రవాణ), మార్చి 16ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ అవతారణకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆశయాలు తెలుగు వారికి ఆదర్శనమని బిజెపి నాయకులు పేర్కొ న్నారు. తిరుపతి రూయా ఆస్పత్రి వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆదివారం బిజెపి నాయ కులు పుష్పాంజలి ఘటించారు. ఆయన త్యాగాన్ని నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, సురేష్‌స్వామి,జయంత్‌కుమార్ కొనియాడారు.

## విద్యార్థులు పట్టుదలగా చదవాలి:శ్రీకాళహస్తికి మంచిపేరు తేవాలి

శ్రీకాళహస్తి,మార్చి 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి చెందిన పదవ తరగతి విద్యార్థులు పట్టుదలగా చదవాలని శ్రీకాళహస్తికి మంచిపేరు తీసుకురావాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.విద్యార్థులు భయాన్ని విడిచిపెట్టి ధైర్యంగా పరీక్షలు రాయాలని సూచించారు. కృషి చేసి మంచి ఫలితాలను సాదిస్తారని ఆశిస్తున్నానని సుధీర్‌రెడ్డి వివరించారు. అధ్యాపకులు పరీక్షా కేంద్రాల్లో మంచినీటి సదుపాయం,మరుగుదొడ్లు,మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యార్థులకు ప్రశాంత వాతావరణం కల్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక ప్రయోజనకరమైన కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులతో ఉపాధి అవకాశాలను పొందటానికి యువ నాయకుడు మంత్రి నారాలోకేష్ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారన్నారు.చదువుకున్న వారికి ఉపాధి కోసం ఎన్నో పరిశ్రమలు తీసుకొస్తున్నారని చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశం ఉంటుందన్నారు.

## నియోజకవర్గంలో వైకాపా బలోపేతానికి కమిటి పదవులు

శ్రీకాళహస్తిరూరల్,మార్చి 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైకాపా బలోపేతానికి కమిటీలను ఏర్పాటు చేసి ఆశావహులకు పదవుల అవకాశం కల్పిస్తూ ఉత్సాహపరుస్తున్నారు.ఈ నేపధ్యంలో స్థానిక మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కృషి చేసి పార్టీలో మౌనంగా ఉన్న వారందరిని ఉత్సాహ పరచుటకు పార్టీ పదవులను ప్రసాదిస్తున్నారు. నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో ఆశావహులకు కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఎవరైతే గతంలో పార్టీకి పని చేసిన వారిపై గురి పెట్టిన దరిమిలా పార్టీ పదవులతో ప్రోత్సహించుటకు ప్రణాళిక రచించుకొని ముందుకు వెళుతున్నారు. ఏడాదిలో ఏం చేసారు? అనే అంశంపై కొత్తగా ఏర్పాటు అయిన కమిటీలకు దిశ దెశ నిర్దేశం చేస్తున్నారు.ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మండలం మన్నవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు రంగినేని చెంచయ్యనాయుడును వాలంటీర్స్ విభాగం అధ్యక్ష పదవిని ప్రసాదించారు.ఈ సందర్భంగా చెంచయ్యనాయుడుమాట్లాడుతూ 2029 ఎన్నికల్లో బియ్యపు మధుసూధనరెడ్డిని ఎంఎల్ఏ చేసే ప్రయత్నంలో నిమగ్నమౌతామని వివరించారు.ఈ సందర్భంగా తనకు పదవి అవకాశం కల్పించిన స్థానిక వైకాపా నాయకుడు బియ్యపు మధుసూధనరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షుడు కార్తీక్

శ్రీకాళహస్తి,మార్చి 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి వైకాపా పార్టీ అభ్యర్థి విభాగం అధ్యక్షుడుగా పట్టం కార్తీక్‌ను నియమిస్తూ పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారి చేసింది. శ్రీకాళ హస్తి పట్టణంలో శాసనసభ ఎన్నికల్లో తీవ్ర నిరాశ కల్గించింది. సుమారు 18వేల ఓట్లు వెను కంజలో ఉన్నారు. కాబట్టి పార్టీని పట్టణంలో బలోపేతం చేసే దిశగా మాజీ శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి చర్యలు తీసుకుం టున్నారు.ఈ నేపధ్యంలో పట్టం కార్తీక్ మాట్లాడుతూ తాను చదువుకుంటున్న రోజుల నుంచి రాజకీయాల మీద ఆసక్తితో తాను బియ్యపు మధుసూధనరెడ్డిని ఆదర్శంగా తీసుకున్నానన్నారు. తనకు విద్యార్థి సంఘ నాయకుడుగా ఎంపిక చేసిన మధుసూధనరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా మధుసూధనరెడ్డి సూచిస్తూ తనకు సన్మానాలు కాదని పార్టీని మళ్ళీ పూర్వ వైభవానికి తీసుకురావాలని పిలుపు నిచ్చారు.

## తిరుపతి ప్రైవేట్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా రూపేష్

తిరుపతి హెల్త్, మార్చి 16 ప్రభాతవార్త ః

తిరుపతి ప్రైవేట్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడుగా రూపేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని ముత్యాలమ్మ ఆలయం ప్రాంగణంలో అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు కన్వీనర్, ఎన్నికల అధికారి బొడుగు మునిరాజు యాదవ్ జరిగాయి.అలాగే అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా భాషా, కోశాధికారిగా మల్లికార్జున్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షులు శ్రీనివాసులు, కేశనేని ట్రావెల్స్ సుబ్రమణ్యం, ఎంఎంఆర్ ట్రావెల్స్ మునిచంద్ర, గరుడ ట్రావెల్స్ రాము, జగన్ ట్రావెల్స్ మురళీలతో పాటు పలువురు ట్రావెల్స్ నిర్వాహకులు, దాదాపు 500 మంది తిరుపతి ట్రావెల్స్ అసోసియేషన్ నేతలు, సభ్యులు, ట్రావెల్స్ ప్రతినిధుల బృందం పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

## పాఠశాలల్లో విద్యార్థుల మార్పులపై అపోహాలు వద్దు : ఎమ్మెల్యే

కేవీబీ పురం, మార్చి 16 ప్రభాతవార్త:



మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులను వేరే పాఠశాలకు మేడ్జింగ చేయడం ప్రగతి నైపుణ్యాలను వెలిగి తీయడానికే ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలు తీసుకుందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. కేవీబీ పురంలో ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ పాఠశాలల్లో విద్యాబుద్ధులు అభివృద్ధి చేయడానికి కోసమేనని ప్రతి పాఠశాలను ఒక మోడల్ స్కూలుగావిద్యాభివృద్ధిలో నైపుణ్యలను పొందడానికి చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. త్వరలో ఏప పాఠశాలల వద్ద డీఎస్సీని ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి విద్యార్థి నైపుణ్యాలను పొందడానికే ఇలాంటి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సూరమాల గ్రామంలో పలువురు తమ బడి పిల్లలను గుంటుపేడు పంపిస్తున్నారని, అంజూరు గ్రామానికి పోతే బాగుంటుందని పాఠశాల విద్యార్థుల పంపిస్తే మేము పాటశాల కూడా పంపించామని మొరాయించడంతో ఎమ్మెల్యే వారికి సర్దిచెప్పి అలాంటివి జరగదని, అపోహాలు ఎవరూ పెట్టుకోవద్దని ఆయన పేరెంట్స్‌ని కోరారు. ఎమ్మెల్యేతో పాటు మండల నాయకులు ఇళంగోవన్‌రెడ్డి, పాలమంగళం రమేష్, శ్రీహరియాదవ్, బాలాజీ, వెంకటేశ్వరులు, మంల పార్టీ అధ్యక్షులు, పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు సర్వం సిద్ధం - ఎంఈవో

కేవీబీ పురం, మార్చి 16 ప్రభాతవార్త:

కేవీబీ పురం పరీక్షా కేంద్రాల వద్ద 81 మంది బాలురు, 75 మంది బాలికలు పరీక్షలకు హాజరవుతారని ఎంఈవో తెలిపారు. సోమవారం నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, అంతా సిద్ధం చేసినట్లు ఎంఈవో తెలిపారు. మండలంలోని అంజూరు పరీక్షా కేంద్రంలో 80 మంది బాలురు, 57 మంది బాలికలు 137 మంది విద్యార్థులు రాయనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీరు, బల్లలు, తదితరవి ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## సందీప సారంగంకు డాక్టరేట్ ప్రదానం

తిరుపతి విద్య మార్చి 16 ప్రభాత వార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మేనేజ్మెంట్ విభాగం పరిశోధన విద్యార్థిని సందీప సారంగం కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆ యూనివర్సిటీ డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య జీవనజ్యోతి తెలిపారు. ఈమె ఆ విభాగం ఆచార్యురాలు డాక్టర్ జె కాత్యాయని పర్యవేక్షణలో "ఎ స్టడీ ఆన్ నేచర్ అఫ్ ఉమెన్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ ఎమాంగ్ ఎస్ హెచ్ జీస్ ఇన్ ఆంధ్రప్రదేశ్" అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను ఆమెకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆచార్య జీవనజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు.

## నేడు శేషాచలం బయోడైవర్సిటీపై సదస్సు

తిరుపతి విద్య మార్చి 16 ప్రభాత వార్త

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ బ్యూరో, అక్షరా ఫౌండేషన్ సంయుక్తంగా (నేడు) సోమవారం ఉదయం 10 గంటలకు ఎస్వీయు సెనేట్ హాల్ నందు శేషాచలం బయోడైవర్సిటీ అనే అంశంపై ఒకరోజు సదస్సు నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమంలో తిరుమల అదనపు కార్యనిర్వాహణ కార్యదర్శి వెంకయ్య చౌదరి,ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయకుమార్,ఎస్వీయూ విసి ఆచార్య అప్పారావు,రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు,వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి,జిల్లా అటవీశాఖాధికారి వివేక్ ఐ.ఎఫ్.ఎస్,తుడా కార్యదర్శి వెంకట్ నారాయణ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారని సదస్సు నిర్వాహకులు డాక్టర్ పాకనాటి హరికృష్ణ,మద్దినేని హరిబాబు ఒక సంయుక్త ప్రకటనలో తెలియజేశారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సభ

తిరుపతి హెల్త్, మార్చి 16 ప్రభాతవార్త ః



సిపాయి గోవిందరెడ్డి స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సభ ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. 2004–2007 ఫస్ట్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఒక అనుభూతిని కలిగించింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రష్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హాజరై విద్యార్థి దశ, స్నేహం గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు గురువులను ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రమీల, రజిని, లీలావతి, అమరావతి, అనురాధ, మీన, సుమతి, శ్రీ లత, హేమలత, వనిత, ఆరోగ్య సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జామియా మస్‌జిద్‌లో ముతవల్లిచే 'ఇఫ్తార్ విందు'

శ్రీకాళహస్తి,మార్చి 16ప్రభాతవార్త



పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా 15రోజు ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలకు ఆదివారం జామియా మస్‌జిద్‌లో ముతవల్లి(అధ్యక్షులు) అక్రమ్ సాహెబ్ 'ఇఫ్తార్ విందు'ను ఏర్పాటు చేసారు. వందలాది మంది ముస్లింలకు జామియా మస్‌జిద్‌లో విందును ఏర్పాటు చేసారు. ఉపవాసదీక్షల విరమణ సందర్భంగా చికెన్ బిరియానిని అందించారు. పవిత్ర రంజాన్ మాసంలో ఎవరైనా దానం అచరిస్తే 70వంతుల అదనపు పుణ్యం వస్తుందని చెబుతారు.ఈ నేపధ్యంలో విందును ఏర్పాటు చేసారు.ప్రతి రోజూ దాతల సహాకారంతో సాయంత్రం ఉపవాసదీక్షలు విరమణ సందర్భంగా ఆష్ వితరణ చేస్తారు. విందు కార్యక్రమాల్లో మసీదు పేష్ఇమాం హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్, మసీదు కమిటి పెద్దలు ఖలీల్ హుసేని,పఠాన్ నూరుల్లా ఖాన్ చాన్‌బాషా, అంజద్‌సాహెబ్, తాజుద్దీన్,హమీద్,మౌజన్ సాహెబ్ మహాబూబ్‌బాషా,ముస్లిం యువత సహాకరించారు.

## నీలాయపాలెం విజయకుమార్‌కు ఘనసన్మానం

తిరుపతిలో జరిగిన పలు కమిటీల ఛైర్మన్‌ల సన్మానంలో బయో డైవర్సిటీ ఛైర్మన్ నీలాయ పాళం విజయకుమార్‌ను అభినందిస్తున్న బిజెపి నేత నవీన్‌కుమార్‌రెడ్డి

ప్రభాతవార్త –తిరుపతి



# తిరుపతి డివిజన్

## టిడిపి ఎన్నికలలో ఇచ్చిన హామిలను నేరవేర్చాలి

### మాజీ మంత్రి ఆర్కె రోజా



నింద్ర, మార్చి 16 ప్రభాతవార్త :

2024వసంవత్సరంలో ఎన్నికలలో ప్రజలకు టిడిపి పార్టీ ఇచ్చిన హామిలను వెంటనే నేరవే ర్చాలని మాజీ మంత్రి ఆర్కె రోజా డిమాండ్ చేసారు.అదివారంమండలంలోని జియన్ కండ్రిగ గ్రామ పంచాయితీ,యంసి కండ్రిగ గ్రామంలో గోవిందమ్మ కుటుంబాన్నిమాజీమంత్రిఆర్‌కెరోజా పరామర్శించి నారు. ఆమె మాట్లాడుతూ టిడిపి పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక హామిలు ఇచ్చి గెలిచిన తరువాత వాటిని తుంగలో తొక్కుతుందని విమర్శించారు.ఈకార్యక్రమంలో యంపిపి దీపాజ లంధర్‌రాజు,మండల వైకాపా కన్వీనర్ వేణురాజు,వైకాపా రాష్ట్ర యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్, నాయకులు పరందామయాదవ్,సత్యరాజ్,బాబు,వీరయ్యనాయుడు,చార్లీ,రాము,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా శ్రేయస్సే టిడిపి ప్రభుత్వం లక్ష్యం

### నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నింద్ర,మార్చి 16 ప్రభాతవార్త :



ప్రజా శ్రేయస్సే టిడిపి ప్రభుత్వం లక్ష్యమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు.అదివారం మండలంలోని కైపాకం,పాదిరి గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమంలో నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేద ప్రజల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తున్నారని తెలిపారు.కార్యకర్తలకు యెల్లవేళల అందుబాటులో వుండి వారి సమస్యలు పరిష్క రించడానికి కృషి చేస్తానని అన్నారు.కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పేరం వేంకటేశ్వరరావు, నాయకులు చిట్టిబాబునాయుడు,రవినాయుడు,రమేష్,బాబుయాదవ్,తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ప్రతిష్టకు పనిచేయండి..!

### చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



రామచంద్రాపురం, మార్చి 16 ప్రభాతవార్త:

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చంద్రగిరి నియోజ కవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసంలో ఆయ నను మర్యాదపూర్వకంగా కలసి సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి పట్టుకొమ్మలు కార్యకర్తలు అన్నారు. పార్టీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు.వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రాయలచెరువులో ఉపాధిహామీ గ్రామసభ

రామచంద్రాపురం, మార్చి 16 ప్రభాతవార్త:



2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు రాయలచెరువు గ్రామ పంచాయతీలో జరిగిన ఉపాధి పనులను సామాజిక తనిఖీ బృందం మూడు రోజుల పాటు తనిఖీలు నిర్వహించారు. పంచాయతీలో 44 పనులకు గానూ రూ.55 లక్షలు ఖర్చు చేయడం జరిగిందని డిఆర్‌పిలు తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్ళి క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలో ఎంపిడిఓ కార్యాలయంలో నిర్వహించే బహిరంగ సభలో వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురగయ్య, టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి, టిఏలు సుదర్శన్, ఆరోగ్య, తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు సర్వం సిద్ధం ..!

### ఎంఈఓ శ్రీవరం లలితకుమారి



చంద్రగిరి, మార్చి 16 ప్రభాతవార్త:

...కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ శ్రీవరం లలితకుమారి ... ఆమె మాట్లాడుతూ .. సోమవారం నుండి ప్రారంభమవుతున్న పదవ తరగతి ...మండలంలో 11 స్కూల్స్ ప్రభుత్వ నుండి బాలురు 235 మంది బాలికలు 307 ... విద్యార్థులు పరీక్షలకు హాజరకానున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలో 7 ...100 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నట్లు వివరించారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలకు హాజరుకావాలన్నారు. పిల్లలపై వత్తిడి లేకుండా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుందన్నారు. విద్యార్థులు కనీసం ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రానికి చేరుకునే విధంగా సమయాన్ని చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి రవాణాకు సంబంధించిన ఏర్పాట్లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కాగా 10వ తరగతి విద్యార్థులు ఆర్టీసి అన్ని ఆర్డినరీ బస్‌లలో హాల్ టికెట్ చూపించి పరీక్ష కేంద్రానికి ఉచితంగా ప్రయాణించవచ్చని తిరుపతి ఆర్టీసి మేనేజర్ వెల్లడించారు.

## ముగిసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయ మహా కుంభాభిషేకం

పుత్తూరురూరల్, మార్చి 16 ప్రభాతవార్త:





పుత్తూరు మున్సిపల్ పరిధిలోని మరాఠిగేటులో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ మహా కుంభాభిషేకం ఆదివారంతో ముగిసింది. శనివారం సాయంత్రం ఆలయ ఆవరణలో విఘ్నేశ్వర పూజ స్వస్తి పుణ్యావచనం కలశ స్థాపన అంకురార్పణం కలశ పూజ, వాస్తు ఆవాహనం కార్యక్రమాలను చేపట్టారు. అలాగే ఆదివారం ఉదయం గణపతి హోమం నవగ్రహ హోమం, నవగ్రహ శాంతి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం వేకువ జామున 4 గంటలకు పైన ఐదు గంటల లోపు శిఖర కలశంపై ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కలశాలోని జలాన్ని శిఖర కలశంపై అభిషేకం చేశారు. అలాగే ఆలయంలో ప్రతిష్టించిన విఘ్నేశ్వర స్వామికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మరాఠిగేటు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలకు అంతా సిద్ధం : ఎంఈవో

విజయపురం, మార్చి 16 ప్రభాతవార్త:

సోమవారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు అంతా సిద్ధం చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి హరిప్రసాద్‌వర్మ తెలిపారు. మండలంలో పన్నూరు, విజయపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇందులో భాగంగా పన్నూరు జడ్పీ ఉన్న తపాఠశాల పరీక్షా కేంద్రంలో పన్నూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు 61 మంది, వెంగమాంబపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు 12 మంది, విజయపురం జడ్పీ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో విజయ పురం ఉన్నత పాఠశాల విద్యార్థులు 45 మంది, జంబాడ ఉన్నత పాఠశాల నుంచి 25 మంది, శ్రీహరి పురం ఉన్నత పాఠశాలకు చెందిన 29 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఆయన తెలిపారు.

## దక్షిణ కైలాస్‌నగర్‌పై దయలేని అధికారులు

శ్రీకాళహస్తి, మార్చి 16 ప్రభాతవార్త



అత్యధిక రెవెన్యూ కలిగి ప్రాంతంగా దినదినాభివృద్ధి చెందుతున్న దక్షిణ కైలాస్ నగర్‌లో చెత్తనిర్వహణ దయనీ యంగా ఉందని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అంగేరిపు ల్లయ్య విమర్శించారు. ఈప్రాం తం నుంచి అత్యధిక పన్ను లును వసూళ్ళు చేసుకుంటున్న మున్సిపల్ అధికారులు మాత్రం ఇక్కడి కాలనీలో మౌళిక వసతులు కల్పించడంలో మాత్రం మండిపడ్డారు. స్థానిక దక్షిణకైలాస్‌నగర్‌లో అధివారం సిపిఎం నాలుగో రోజు ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఎస్‌డికె నగర్ వాఉలు ఈసందర్భంగా తమ గోడను సిపిఎం నేతల ఎదుట వెల్లబోసుకున్నారు. ఎస్డీకె నగర్‌లో ఉన్న ఏఒక్క వీధిలో కూడా సిసి రోడ్డు, డ్రైన్లు నిర్మించిన పాపాన పోలేదని పుల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాలు వస్తే ఈప్రాంతం ముంపునకు గురవుతోందని వాపోయారు. స్థానిక ఎంఎల్ఏ స్పందించి ఎస్డీకే నగర్‌లో మౌళిక వసతుల కల్పనకు కృషి చేయాలని కోరారు. సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, వెంకటేష్, కుమార్, గురునాథం తదితరులు పాల్గొన్నారు.

# పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని కూడలిలో ఏర్పాటు చేయాలి!

శ్రీకాళహస్తి,మార్చి 16 ప్రభాతవార్త



భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు తన ప్రాణాలను తృణప్రాయంగా వదలిన అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలను శ్రీకాళహస్తిలోని శ్రీ వాసవ కన్యకాపరమేశ్వరి దేవస్థానం సారధ్యంలో భారీ ఎత్తున నిర్వహించారు.ఈ సందర్భంగా వారు పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని ఏదో ఒక కూడలి ప్రాంతాల్లో ఏర్పాటుకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సహాకరించాలని కోరారు. ఆదివారం జరిగిన కార్యక్రమాల్లో పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను, వర్ధంతిని అధికారికం చేసినందుకు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఆర్యవైశ్యుల గుర్తింపుకు ఇది నిదర్శనం అన్నారు.ఈ సందర్భంగా నిరుపేదలకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమాల్లో పట్టణానికి చెందిన పొట్టి చంద్ర,భాస్కర్,మహేష్,జూలుగంటిమురళి,స్వరూప్,చీదేళ్ళ మహేష్,లోకేశ్వరరావు, చీరాల రమేష్,జూలుగంటి జగదీష్,మోహన్,పైడా బాలాజి,శ్రీనివాసులు,మహిళామండలికి చెందిన రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తడలో పది పరీక్షలకు అంతా సిద్ధం



తడ, మార్చి 16 ప్రభాతవార్త: తడ మండలంలో 10వ తరగతి పరీక్షలకు అధికారులు అంతా సిద్ధం చేశారు. సోమవారం తడలోని రెండు కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తడ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 174 మంది బాలురు, బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో 140మంది బాలికలు పరీక్షలు రాయనున్నారు. తడ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు మండల పరిధిలోని చినమాంబట్టు, రామాపురం, కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయం, అక్కంపేటలోని మోడల్ స్కూలు విద్యార్థులు ఈ కేంద్రాలకు హాజరు కానున్నట్లు ఎంఇఓ-2 మల్లికార్జునరావు తెలిపారు.

## ఎమ్మెల్సీని సత్కరించిన తెలుగు యువతనేత



వెంకటగిరి, మార్చి 16 ప్రభాతవార్త : ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగాఎన్నికైన బీద మస్తాన్ రావు వెంకటగిరి తెలుగుదేశంపార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర టిడిపి కార్యదర్శి గంగోడు నాగేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కె.వి.కె ప్రసాద్‌నాయుడు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ పులికల్లు రాజేశ్వరరావు సత్కరించారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలు సత్కారం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సూళ్లూరుపేట, మార్చి 16 ప్రభాతవార్త: సూళ్లూరుపేట సమీపంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపిటిసి పాముల సిద్ధయ్య తీవ్రంగా గాయపడ్డాడు. మన్నారుపోలూరు నుంచి సూళ్లూరుపేటకు స్కూటీపై వస్తున్న సిద్ధయ్యను నెల్లూరు వైపు వెళుతున్న టెంపో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ఇతన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పొట్టిశ్రీరాములు జయంతి

సూళ్లూరుపేట, మార్చి 16 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కస్పేటవీధిలో ఉన్న వాసవి కాంస్య విగ్రహానికి ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అమరజీవి అందించిన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని రాష్ట్ర అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాలు, వాసవీ క్లబ్‌కు చెందిన వారు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడే వారికి గుర్తింపు ఉంటుంది



వెంకటగిరి, మార్చి 16 ప్రభాతవార్త : పార్టీ కోసం కష్టపడే వారికి ఎప్పుడు గుర్తింపు ఉంటుందని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త జంపాల ప్రకాష్ తెలిపారు. జనసేనపార్టీ ఆవిర్భావ దినోత్సవ సమన్వయ కమిటీలో వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్తగా తనను నియమించినందుకు జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్కి, రాష్ట్ర టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్‌కి, తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ మెంబర్ రాధమ్మ, వెంకటగిరి జనసేన పార్టీ నాయకులు చిరంజీవులు, వెంకటగిరి నియోజకవర్గ మండలాల నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళల మృతి



చిల్లకూరు, మార్చి 16 ప్రభాతవార్త: చిల్లకూరు జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాలు మేరకు చిల్లకూరు మండల పరిధిలోని కోట క్రాస్ రోడ్డు ప్రాంతంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని కారు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో పెంచలమ్మ (76) అనే మహిళ మృతి చెందడంతో మరో ముగ్గురుకి గాయాలు పాలైయ్యారు. శ్రీకాళహస్తి నుండి గూడూరుకి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిపారు. క్షతగాత్రులను గూడూరు ఏరియా ఆసుపత్రికి, అక్కడ నుండి నెల్లూరికి తరలింపు మృతి చెందిన మహిళ గూడూరు అశోక్ నగర్‌కు చెందిన వారుగా గుర్తించారు. శ్రీకాళహస్తిలోని కూతురు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. మృతురాలిని మార్చురికి తరలించి, కేసునమోదు చేసి, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 10వ తరగతి పరీక్షలకు సర్వంసిద్ధం



కోట, మార్చి 16 ప్రభాతవార్త : 10వ తరగతి పరీక్షల నిర్వహణకు కోట మండలంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఇఓ మస్తానయ్య చెప్పారు. ఆయన ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ కోట మండలంలోని ఆరు కేంద్రాల్లో 971 మంది విద్యార్థులు, 12 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లోకి ఇన్విజిలేటర్లు, స్క్వాడ్ సహా సిబ్బంది ఎవరూ సెల్‌ఫోన్లు వినియోగించకూడదని తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.

# గూడూరు డివిజన్

## రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన శ్రీరాములు : ఎమ్మెల్యే



గూడూరు, మార్చి 16 ప్రభాతవార్త: ఆంధ్ర రాష్ట్రం కొరకు నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని గూడూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు. పిఎస్సార్ 125వ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌వద్ద ఉన్న పీఎస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలవేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగువారి కొరకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలని పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రణాలు అర్పించి రాష్ట్రాన్ని సాధించారని గుర్తు చేశారు. ఆ మహనీయుడి ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి చెంచురామయ్య, బిల్లు చెంచురామయ్య, ఇజ్రాయిల్, రహీం తదితరులు పాల్గొన్నారు.

## పేటలో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు



నాయుడుపేట, మార్చి 16 ప్రభాతవార్త: నాయుడు పేటలో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలువేసి నివాళర్పి ఒచారు. ఈసందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గూడూరు కిషోర్ కుమార్ మాట్లడుతూ తెలుగుబాష,తెలుగుజాతి కోసం ప్రాణాలర్పి ఒచిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. పట్టణ ంలోని మేరీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యవసర సరుకులు ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సురేష్‌శెట్టి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్యశిబిరం



కోట, మార్చి 16 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లో ఆదివారం సుశీల నేత్రాలయం నెల్లూరు వారిచే ఉచిత మెగా నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ సుధాకంరావు పాల్గొన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 200 మందికి పైగా ఈ శిబిరానికి రాగా, 70 మందికి పైగా కంటి శుక్లములు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. అటువంటి వారిని శస్త్ర చికిత్సల కోసం నెల్లూరుకు పంపినట్లు తెలిపారు. ఈ శిబిరంలో సుశీల నేత్రాలయం సిబ్బంది విజయ్, హెచ్ఆర్ మేనేజర్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు. తమకు సహకరించిన సాయిబాబా మందిరం సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

## అంగరంగ వైభవంగా స్వామి రథోత్సవం



గూడూరు, మార్చి 16 ప్రభాతవార్త: గూడూరు పట్టణంలోని శ్రీ అళఘునాథ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామి వారు విశేష అలంకరణలో రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహి ంచిన అనంతరం రథోత్సవం కార్యక్రమం ప్రారంభించారు. భక్తులు స్వామి వారి రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. పట్టణంలోని ప్రధాన మార్గాల మీదుగా స్వామివారి రథోత్సవం సాగింది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

## వ్యక్తిపై కర్రతో దాడి!

నాయుడుపేట మార్చి 16 ప్రభాతవార్త : పెళ్ళకూరు ఎస్సీ కాలనికి చెందిన దాసరి వెంకటేశ్వర్లుపై అదే కాలనీకి చెందిన కోగిలి మణి కర్రతో దాడిచేసి తలపై తీవ్రంగా గాయపరిచిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసులు సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.పెళ్ళకూరు ఎస్సీ కాలనీకి చెందిన దాసరి వెంటేశ్వర్లు ఇంటిలో భోజనం చేస్తుండగా కోగిలి మణి పాతకక్షలు మనస్సులో పెట్టుకొని ఇంటి బయటకు రావాలని పిలవడంతో వెంకటేశ్వర్లు ఇంటిబయటకు వచ్చేసరికి అక్కడే ఉన్న మణి కర్రతో దాడిచేసి తలపై తీవ్రంగా గాయపరిచాడు.స్థానికులు గుర్తించి గాయపడిన వెంటేశ్వర్లును 108సహాయంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ఎస్సై నాగరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దివ్యాంగులకు కూరగాయలు పంపిణీ



గూడూరు, మార్చి 16 ప్రభాతవార్త : గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నివిసిపోర్కు నందు ఒగ్గు భాస్కర్ దాతృత్వంలో దివ్యాంగులకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎం.ఈ.ఓ. రవూఫ్ చేతుల మీదుగా కూరగాయలు, గుడ్లు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం జేవివిఉపాధ్యక్షులు చెంచు నారాయణ మాట్లాడుతూ జేవివి ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు ప్రతినెల మూడవ ఆదివారం కూరగాయలు, గుడ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ. రవూఫ్, నాగరాజు, చెంచునారాయణ, రామమోహన్, ప్రభాకర్, ఇబ్రహీం, అరుణ్‌కుమార్, పవన్‌కుమార్, సురేష్, శ్రీనివాసాచారి, గుండాలసుందరం, సుధీర్‌లు పాల్గొన్నారు.

## స్పీకర్ హోమ్ బిర్లాను కలిసిన ఎంపీ



వెంకటగిరి, మార్చి 16 ప్రభాతవార్త: లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను తిరుపతి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మద్దెల గురుమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని స్పీకర్ నివాస గృహంలో ఎంపీ గురుమూర్తి శాలువాతో సత్కరించారు. పార్లమెంట్ సమావేశాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని స్పీకర్‌కు అభినందనలు తెలిపారు. పార్లమెంటులో అందరికీ మాట్లాడే సమయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

## దుకాణాలను తనిఖీ చేసిన కమిషనర్



గూడూరు, మార్చి 16 ప్రభాతవార్త: చికెన్ మటన్ దుకాణాల యందు పరిశుభ్రమైన చికెన్, మటన్ అమ్ముతున్నారా లేదా అని, ఫ్రీజర్ నందు చికెన్ మటన్ మాంసమును నిల్వ చేయుచున్నారా లేదా అని పురపాలక సంఘ కమిషనర్ ఆదివారం తనిఖీలు చేసారు. ఈ తనిఖీలలో భాగంగా రెండు ఫ్రీజ్ చేసిన పొట్టేలు తలలను డిస్పోస్ చేసారు. వీటితో పాటు చికెన్, మటన్ మాంసంను ఎటువంటి కవర్లలో ప్యాకింగ్ చేస్తున్నారని తనిఖీ చేసి, పేపరు, అరటి ఆకులలో మాంసంను ప్యాక్ చేసి అమ్మవలసినదిగా ఆదేశాలు జారీ చేసారు. ఇకపై, అపరిశుభ్ర వాతావరణంలో మాంసమును అమ్మినా, ప్లాస్టిక్ కవర్ల యందు మాంసంను అమ్మినా, ఫ్రీజర్ నందు నిల్వ ఉంచిన మాంసంను అమ్మినా సదరు దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## అమరజీవికి ఘన నివాళి



కోట, మార్చి 16 ప్రభాతవార్త: అమరజీవి పొట్టిశ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర అవతరణకు చేసిన త్యాగం మరువలేనిదని ఆర్యవైశ్య సంఘం నాయకులు నాగరాజు, లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఆదివారం కోటలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరజీవి పొట్టిశ్రీరాములు ఒక గొప్ప త్యాగమూర్తి అని, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆద్యుడని కొనియాడారు. అటువంటి మహనీయుడిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని వారు కోరారు.

## ఆర్టీసి సర్వీసులను పునరుద్ధరించాలి



గూడూరు, మార్చి 16 ప్రభాతవార్త: గూడూరులో రద్దు చేసిన పలు ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరిం చాలని ఇంకా పలు సమస్యల పరిష్కరించాలని ఎన్ఎంయు నాయకులు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అంద జేశారు. ఆదివారం గూడూరు ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. నాయకులు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలగా 20 బస్సు సర్వీసులు రద్దు చేయడం జరిగిందని అలాగే ఈనెలలో కొత్త సర్వీసులు ఎమ్మెల్యే డీటీసీ ముందు ప్రారంభిస్తామని చెప్పిన డిఎం వాటిపై ఇంతవరకు నోట్ ఫైల్ రెడీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంయు నాయకులు ప్రవీణ్, భాష, శ్రీనివాసులు, హరి తదితరులు పాల్గొన్నారు.

## దేవాంగులు అందరూ ఐక్యతతో వుండాలి

**- దేవాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు మన్నెం సతీష్ కుమార్**



గూడూరు, మార్చి 16 ప్రభాతవార్త: దేవాంగులు అందరూ ఐక్యతతో వుండాలని దేవాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు మన్నెం సతీష్ కుమార్ పిలుపు నిచ్చారు. ఆదివారం చెన్నూరు దేవాంగ సంఘం ఆధ్వర్యంలో ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా దేవాంగ సంగం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మన్నెం సతీష్‌కుమార్ మాట్లాడుతూ దేవాంగులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సూచించారు. దేవాంగుల్లో బాగా చదివే పేద విద్యార్థులకి అనారోగ్య పరిస్థితిలో వున్న వారికి ఆర్థిక సాయం అందజేస్తామని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రధాన కార్యదర్శి పాముజుల శంకరయ్య, కోశాధికారి కొండా మాదవయ్య, ఉపాధ్యక్షులు కటికాల శేషు కర్ణ చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు మధిర బాలయ్య, కొండా శేఖర్, చెన్నూరు దేవాంగ సంగం అధ్యక్షులు జాగాబత్తిన శ్రీనివాసులు, హరికృష్ణ, సునీల్, చంద్ర, రమేష్, రాఘవ, రమణయ్య, బాలగురవయ్య తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ కనుమల వృక్ష సంపద అధ్యయన యాత్ర



తిరుపతి విద్య, మార్చి 16 ప్రభాతవార్త : శ్రీ వేంకటేశ్వర విద్యాలయ వృక్షశాస్త్ర విద్యార్థులు మూడు రోజుల పశ్చిమ కనుమల వృక్ష సంపద, జీవవైవిధ్యం అధ్యయన యాత్రకు శ్రీకారం చుట్టారు.వృక్ష శాస్త్ర విభాగ అధ్యాపకులు ఆచార్యలు క్ష్మీ నాగలదేవమ్మ, కామాక్షమ్మ, వేణు, అంకన్నల పర్యవేక్షణలో, విద్యార్థులు రూపేష్,శివాని నాయకత్వంలో విభాగంలో సుదీర్ఘకాలం తర్వాత మొదటి,రెండవ సంవత్సర విద్యార్థిని విద్యార్థులు పశ్చిమ కనుమలు వృక్ష సంపద, జీవవైవిధ్యం అనే అంశం పై హొగేనెక్కల్ జలపాతం,టీ ఫ్యాక్టరీ, థ్రెడ్ గార్డెన్,రోజ్ గార్డెన్, నేషనల్ బొటనికల్ గార్డెన్,ఊటీ కొండలు, అతిరేపల్లి జలపాతం కేరళ ప్రదేశాలను సందర్శించి మొక్కల అధ్యయనం చేయడం జరిగిందన్నారు. విద్యార్థులు అధ్యయనంతో పాటు,వైవిధ్యమైన మొక్క భాగాల సేకరణ చేపట్టడం జరిగిందని, వాటిని హెర్బేరియం షీట్‌ల ద్వారా నిల్వ ఉంచుతామని అధ్యాపకులు తెలియజేశారు. విద్యార్థులు మాట్లాడుతూ ఈ అధ్యయన యాత్ర చాలా ఉపయుక్తంగా ఉందని అన్నారు.వీరు రేపు వర్సిటీని తిరిగి చేరుకోనున్నారు.

# నేడు తుదివిడత విచారణ!

## తొక్కిసలాట ఘటనపై నివేదిక కీలకం

### -ఇంకెందరిపై సర్కార్ వేటువేస్తుందో!?

**తిరుమల/తిరుపతి-ప్రభాతవార్తప్రతినిధి:**



గత జనవరిలో పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు ప్రారంభానికి ముందే తిరుపతిలో చోటుచేసుకున్న తొక్కిసలాట విషాదఘటనపై తుదివిడత విచారణ (నేడు) సోమవారం జరగనుంది. ఘటనపై విచారణ ముగించి నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తే తదుపరి మరెందరిపై సర్కార్ వేటువేస్తుందనేది టిటిడి, పోలీసు,రెవెన్యూ, విజిలెన్స్‌వర్గాల్లో గుబులుపట్టుకుంది. గత జనవరి 8వతేదీ రాత్రి తిరుపతిలో ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్ల జారీకోసం భారీగా భక్తులు రావడం, సకాలంలో సరైన సౌకర్యాలు, భద్రత, రద్దీ నియంత్రణలో వైఫల్యం చెందడంతో ఆరుగురు మృతి చెందారు. 51మంది భక్తులు క్షతగాత్రుల య్యారు. ఈ ఘటనపై న్యాయ విచారణకు ప్రభుత్వం ఆదేశించడంతో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, తొక్కిసలాటఘటన న్యాయవిచారణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ సత్యనారాయణ మూర్తి తిరుపతికి చేరుకున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా తిరుపతిలో ఘటనా స్థలిని పరిశీలించడం, సంబంధిత టిటిడి,జిల్లా రెవెన్యూ, పోలీసు అధికారులను విచారణ చేయడం జరిగింది. రెండోవిడతలో బాధితులైన ప్రత్యక్షసాక్షులను కొందరిని కలవడం, కొందరితో వర్చువల్‌గా విచారణ చేసి వివరాలు సేకరించారు. ఇప్పుడు మలి విడతగా తుదిదశ విచారణ చేపట్టనుండటంతో సోమవారం కీలకంగా మారింది. తిరుపతి కలెక్టరేట్‌లోని ప్రత్యేక ఛాంబర్‌లో జస్టిస్ సత్య నారాయణ మూర్తి టిటిడి ఈఓ శ్యామలరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అదనపు ఎస్పీలను,కొందరు సిఐలను పలు ప్రశ్నలు సంధించి సమాదానాలు రాబట్టనున్నారు. ఈ వివరాలతో లోపాలు, తప్పిదాలు, నిర్లక్ష్యం ఎవరిది,ఎందుకు, ఎలా అనేది నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తారు. ఆ తరువాత ఈ ఘటనలో కొందరు సిఐలు, ఎస్ఐలు, పోలీసులపై ఇప్పుడు రానున్న రోజుల్లో వేటుపడే సూచనలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ఆదివారం జస్టిస్ సత్యనారాయణమూర్తి తిరుమలలో వైకుంఠమ్ క్యూలైన్ల ద్వారా ఆలయంలోనికి భక్తులను అనుమతిస్తున్న విధానం బావుందని, ఆలయంలోపల తోపులాట లేకుండా చూస్తుండటం సిబ్బంది పనితీరు పట్ల సదభిప్రాయం వ్యక్తమైంది. మహద్వారం గేట్ వద్ద భక్తులను నియంత్రించి,రద్దీని కట్టడిచేస్తూ ఆలయంలోపలకు సామాన్యభక్తులను అనుమతించే విధానం ఆదివారం ఆయన పరిశీలించారు. కాగా తదుపరి అందే నివేదికల ఆధారంగా ఎవరిని అరెస్టు చేస్తారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా తిరుపతిలో తొక్కి సలాట ఘటనపై ఢిల్లీకి ఫిర్యాదులు వెళ్ళాయి. టిటిడి నిర్లక్ష్యం కారణంగానే తిరుపతిలో ఈ ఘటన జరిగిందని టిటిడి పై జాతీయ మానవ హక్కుల సంఘానికి .కేంద్ర హోంశాఖకు ఫిర్యాదులు వెళ్ళాయి.

## భోళాశంకరుని దర్శనానికి కదలి వచ్చిన భక్త జనం

**హరనామస్మరణతో మార్మోగిన శైవాలయం**



శ్రీకాళహస్తి,మార్చి 16 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి చెందిన శ్రీకాళహస్తీశ్వరా లయం ఆదివారం శివభక్తులతో కిట కిట లాడింది. ఆలయ పరిసరాలు పుణ్యక్షేత్రం హరనామస్మరణతో మార్మోగింది. ఇక ఇక్కడకు వచ్చిన భక్తులకు తిప్పలు, సరైనా సమాచారం లేదు. దళారులు సుదర్శనం, సత్వర దర్శనం అంటూ మభ్యపెట్టి తమ వ్యాపారాలనుసజావుగాసాగుతూనే ఉన్నాయి. శ్రీకాళహస్తీశ్వ రాలయానికి తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా పొరుగున ఉన్న తమిళనాడు, కర్నాటకల నుంచి విశేష సంఖ్యలో భక్తులు కదలివస్తున్నారు.దాంతో ఆలయంతో పాటు పట్టణం కిట కిట లాడుతుంది. ఇక్కడి ఆలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజలు మహిమాన్వితమైనవి కావటంతో భక్తులు కదలి తరంగాల్లా కదలి వస్తున్నారు. స్వామి అమ్మవార్లను దర్శించు కుంటున్నారు. వారంలో ఒక్క బుధ, గురువారం తప్ప మిగిలిన రోజుల్లో కనీసం 30వేల మంది దర్శించుకుంటున్నారు. వారికి సమాచారం అందించటంలో దేవస్థానం అధికారులు విఫలమౌతున్నారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు 5వేలు జరిగాయి. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన దళారుల వ్యవస్త రూపుమాపాలంటే మాస్టర్‌ప్లాన్ అమలు జరగాలి. కొత్తక్యూలైన్లు వస్తే ఒక సారి భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశిస్తే ఇక దర్శనం తరువాతనే బయటకు వచ్చే అవకాశం.

## ఎండనుండి రక్షణకు కూల్‌కూల్



తిరుమల,మార్చి 16ప్రభాతవార్తప్రతినిధి: వేసవి కాలం అరంభంలోనేతిరుమలపై సూర్యుని ప్రతాపం భగభగలకు భక్తులు విలవిల్లాడిపోతున్నారు. తిరుపతి ఉష్ణోగ్రతలు తిరుమలలోనూ నమోదవుతుండటం పర్యావరణ కాలుష్యం కారణంగా శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. భక్తులకు ఎండవేడి నుంచి ఉపశమనానికి ఆలయం ముందుభాగం,పరిసరాల్లో, ఆలయ మాఢవీధుల్లో తెల్లని కూల్ పెయింట్ వేసి భక్తులు నడిచేలా చూస్తున్నారు. ఆలయం పరిసరాల్లో పూర్తిగా ఎండవేడిమి నుంచి ఉపశమనం కలిగించేలా చూస్తుండటంతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## పుట్టగొడుగుల్లా మద్యం బెల్ట్ షాపులు

గుడిపాల, మార్చి 16 ప్రభాతవార్త: గుడిపాల మండల పరిధిలో మద్యం బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా వ్యాపిస్తున్నాయి. మండల పరిధిలోని ప్రతి గ్రామంలో రెండు, మూడు మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తుండటంతో గ్రామం ల్లోనే మంద్యం మందుబాబులకు అందుబాటులో వుండటంతో మందు బాబులు మద్యం షాపులకు వైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మద్యం బెల్ట్ షాపులకు ఎక్కడా ఎలాంటి పరిమితులు ఇవ్వకున్నప్పటికీ మద్యం షాపు యాజమానులు తమ మద్యం అమ్మకాలను పెంచుకోవడం కోసం ఒకే గ్రామంలో పలు మద్యం బెల్ట్ షాపులకు మద్యంను సరఫరా చేసి లాభాలు దండుకుంటు న్నారు. మద్యం బెల్ట్ షాపులను ఎక్కడైనా అనుమతిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేసినప్పటికీ క్షేత్ర స్థాయిలో ఎక్సైజ్ అధికారులు, మద్యం దుకాణాల యాజమానులు కుమ్మక్కు కావడంతో ఇది ఆచరణలోకి రాని పరిస్థితి ఏర్పడింది. మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతి రోజు తెల్లవారుజాము నుండి అర్ధరాత్రి వరకు బెల్ట్ షాపుల్లో మద్యం వ్యాపారరం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. మద్యం దుకాణాల్లో లభ్యం అయ్యే మద్యం ధర కంటే ఒక బాటిల్‌పై రూ.10 నుండి రూ.20 మాత్రమే ఎక్కువగా బెల్ట్‌షాపుల్లో లభ్యం అవుతుండటంతో ఆ మద్యం కొనుగోలు చేసి సేవించడానికి మందుబాబులు సిద్ధమవుతున్నారు. అయితే కొన్ని మద్యం బెల్ట్ షాపులు కర్నాటక మద్యంను మందుబాబులకు విక్రయిస్తూ ఎక్కువ మొత్తంలో లాభాలు ఆర్జిస్తుండటంతో ఈ వ్యవహారంపై ఎక్సైజ్ అధికారులు దృష్టి కేంద్రీకరించాల్సి వుంది.

## శివయ్య సేవలో హైకోర్టు జడ్జి



శ్రీకాళహస్తి,మార్చి 16 ప్రభాతవార్త : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి కుటుంబసభ్యులతో పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఇఓ విద్యా సాగర్‌రెడ్డి పిఆర్ఓ రవిలు వేదపండితులచే స్వాగతం చెప్పారు.రాష్ట్ర హైకోర్టు జడ్జి వై.లక్ష్మణరావు కుటుంబసభ్యులతో హాజరయ్యారు. ఆలయంలో స్వామి అమ్మవార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. దర్శనా నంతరం వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు,తీర్థ ప్రసాదాలు అందించారు. స్వాగతం చెప్పిన వారిలో 12వ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి శ్రీనివాస్ నాయక్,, సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి, ఏపిఆర్ఓలు సుబ్రమణ్యం యాదవ్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్‌లు స్వాగతం పలికారు.

## పది పరీక్షల నిర్వాహణకు సర్వం సిద్ధం

**- మంచి ఫలితాలు సాధించండి- సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోండి**

**- విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్‌ది బెస్ట్ చెప్పిన కలెక్టర్**



తిరుపతి కలెక్టరేట్, మార్చి 16 ప్రభాతవార్త : జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి జరగనున్న పది పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. పది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షా సమయం 9.30 గంటలకు అర్థగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల న్నారు. హడావుడి లేకుండా ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పది పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు ఇప్పటికే చేయడం జరిగిందన్నారు. దూర ప్రాంతాల నుంచి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులు వారి హాల్ టిక్కెట్‌ను ఆర్టీసీ బస్సులోని కండెక్టర్‌కు చూపించి ఉచితంగా బస్సులో ప్రయాణించి పరీక్షా కేంద్రాలకు సమయానికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆల్‌ది బెస్ట్ అని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ చెప్పారు.




ఈ చిత్రం చూశారా... నారదపుష్కరణిలో సాక్షాత్తు ఆకాశమే హద్దుగా అన్నట్లుగా కనిపిస్తుందీ చిత్రం. నాదరపుష్కరిణి సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద పక్కనే నిర్మాణంలో ఉన్న ఓభవనంపై నుంచి తీసిన ఈచిత్రం అందరినీ ఆకట్టు కుంటోంది. ఈ చిత్రంలో పుష్కరిణిలో నీటిలో ఆకాశం సర్వాంగ సుందరంగా కనువిందు చేస్తోంది. ఈచిత్రాన్ని ప్రభాతవార్త తన కెమెరాలో క్లిక్‌మనిపించింది.

ఫోటో -సి.మెహర్‌కుమార్, ప్రభాతవార్త. తొట్టంబేడు,